# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

## క్రైస్తవ మాసపత్రిక

JULY-2013

సంవత్సర చందా రూ.50/-

## సంక్షిప్త వార్తలు

2013, జూన్ 1,2,3 తేదీలలో అమలాపురంలో కరాక్కాయపేట క్రీస్తుసంఘము వారు నిర్వహించిన సువార్త మహాసభలు దేవుని మహిమార్థమై అత్యంత ఘనంగా జరగబడినవి.ప్రముఖ దైవజనులు, బ్రదర్ జాషువా గూటం గారు కుటుంబ సమేతంగా వచ్చి అద్భుత దైవ వర్తమానము అందించి, కోనసీమలోని క్రీస్తుసంఘములను బలపరచిరి. మరియు బ్రదర్ విశ్వేశ్వరరావు గారు (కొవ్వూరు) బ్రదర్ పి.ఎస్. ఆర్ జైపాల్‌గారు (ర్యాలి) మరియు బ్రదర్ వి.రాజ్‌కుమార్ గారు కర్కాకాయిపేట, చక్కటి వాక్యసందేశములందించిరి. స్థానిక క్రీస్తుసంఘ సభ్యులు, పెద్దలు, మూడు రోజుల వచ్చినవారందరికి భోజన ఏర్పాట్లు చేసి చక్కగా సహకరించిరి. మరియు కరాక్కాయపేట క్రీస్తుసంఘము వారు ముద్రించిన "మహిమ గీతములు" అను 285 కీర్తనలతో కూడిన, పాటలపుస్తకమును, "ఆరాధించుటకు నీవు వెళ్ళుచున్న సంఘము నీవు పట్టుకున్న బైబిల్‌నందువున్నదా" అనే పుస్తకమును సహో॥జాషువా గూటం గార్లును, కవిత గూటం గారి చేతుల మీదుగా ప్రార్థనతో విడుదలచేసిరి. బ్రదర్ వి.జె.ఫ్రాన్సిస్ గారు కేజీయ దంపతుల కుమారులు వి. రాజ్‌కుమార్ గారు, వి. బాబిగారు అమలాపురం పరిసర కోనసీమ ప్రాంతములలో దేవుని పక్షమున గొప్ప పనిని చేయుచు క్రీస్తు సంఘముల క్షేమాభివృద్ధి నిమిత్తము బహుగా ప్రయసపడుచున్నారు. "దైవకృప" అనుస్థానిక చానల్‌లో ప్రతి శనివారం రాత్రి 8 గంటలకు బ్రదర్ వి.రాజ్‌కుమార్ దేవుని వాక్యం ప్రకటించుచున్నారు.

2013 జూన్ 14వ తేదీ శుక్రవారం సాయంత్రం, నర్సీపట్నం మండలం, కె. వెంకటాపురంలో జరిగిన సువార్త కూటములో జాషువా గూటం దంపతులు పాల్గొని చక్కటి వాక్యపరిచర్యచేసిరి. స్థానిక సంఘస్థులు, తదితరులు వచ్చి ఆసక్తితో దేవుని వాక్యమును వినిరి. కూటము అనంతరము వచ్చిన వారందరికీ స్థానిక సంఘము భోజనము నేర్పాటు చేసిరి. కె. వెంకటాపురంలో సోదరులు డి.బాబూరావు గారు వాక్యపరిచర్య చేయుచున్నారు.

2013 జూన్ 19వతేదీ బుధవారం రామచంద్రపురం మండలం నర్సాపుర పేటలో నిర్మించబడిన క్రీస్తు సంఘ నూతన ఆలయమును సోదరులు జాషువాగూటం గారు ప్రార్థించి, రిబ్బను కత్తిరించి దేవుని సేవకొరకు ప్రతిష్ఠించిరి. స్థానిక సంఘస్థులు,

# సత్యవాక్కు

**THE WORD OF TRUTH**

P.o. Box -80, Kakinada, A.P. 533 001

Ph : 0884 - 2363722

Editor :

**Joshua Gootam**

*Pleading for Restoration of First Century Christianity*

సంపుటి - 32 | జూలై - 2013 | సంచిక - 12


## విభజనలు అవసరమా ?
## (Are Divisions Necessary ?)

నేడు దేవుని ప్రజలు ఐక్యత కలిగి యుండుట ఎంతో ప్రాముఖ్యమని బైబిలు గ్రంధము బోధించుచున్నది. "సహోదరులు ఐక్యత కలిగి నివసించుట ఎంత మేలు! ఎంత మనోహరము! అది తలమీద పోయబడి అహరోను గడ్డముమీదుగా కారి అతని అంగీల అంచువరకు దిగ జారిన పరిమళ తైలమువలె నుండును. సీయోను కొండలమీదికి దిగివచ్చు హెర్మోను మంచువలె నుండును. ఆశీర్వాదమును, శాశ్వత జీవమును అచ్చట నుండవలెనని యెహోవా సెలవిచ్చి యున్నాడు" అని 133 దా.కీర్తనలో వ్రాయబడి యున్నది.

క్రీస్తు అనుచరులు ఏకమై యుండ వలెనని యేసుక్రీస్తు బోధించెను. "తనకు తానే విరోధముగా వేరుపడిన ప్రతి రాజ్యము పాడైపోవును. తనకు తానే విరోధముగా వేరుపడిన యే పట్టణమైనను ఏ యిల్లయినను నిలువదు" అని మత్తయి 12:25లో ఆయన బోధించెను. ఏ రాజ్యమయినను అంతరంగికముగా ఐక్యత కలిగియుండనియెడల అది తప్పక తన శత్రువుల యెదుట కూలిపోవును.

చరిత్రలో ఈ గొప్ప సత్యమును మనము బాగుగా యెరుగుదుము. అట్లే ఒక కుటుంబ సభ్యులు కూడ తమలో తాము ఐక్యత కలిగియుండని యెడల త్వరలో వారు విడిపోవుట జరుగును. ఈ సందర్భమును కూడ మన దైనిక జీవితాల్లో అనేకసార్లు మనము గుర్తించియే యుందుము. ఇహసంబంధమైన రాజ్యము లోను, గృహములోను, ఐక్యత ఎంత ప్రాముఖ్యమో ఆత్మీయ రాజ్యములోను, గృహములోనుకూడ, ఐక్యత అంతే ప్రాముఖ్యమని మనము గమనించవలెను. దేవుని యొక్క ఆత్మీయరాజ్యమే దేవుని సంఘము. ఆయన సంఘమే ఆయన గృహము. ఆయన సంఘములో యున్న వారు క్రైస్తవులు. వారు క్రీస్తు శిష్యులు. అందుకే యేసుక్రీస్తు తన శిష్యులందరును ఏకమై యుండవలెనని బోధించుట మాత్రమేకాక వారికొరకు ఆయన దీర్ఘముగా ప్రార్థించెను.

అనేకులు యేసు నేర్పించిన మాదిరి ప్రార్థనను పదేపదే వల్లించెదరు గాని, యేసు చేసిన ప్రార్థనలోని అంశము లను మాత్రము మరచిపోవుదురు. యేసు సిలువనీడలో ఉంటూ తనశిష్యులను గూర్చి చేసిన చక్కటి ప్రార్థనను యోహాను సువార్త 17వ అధ్యాయములో మీరు కనుగొన గలరు. ఆ ప్రార్థనలో ఆయన తన శిష్యుల ఐక్యతను గూర్చి యెక్కువ ప్రార్థించెను. ఆయన యిట్లు ప్రార్థించెను: "మరియు నీవు నన్ను పంపితివని లోకము నమ్ము నట్లు తండ్రీ, నాయందు నీవును నీయందు నేనును ఉన్నలాగున, వారును (అనగా శిష్యులును) మనయందు ఏకమై యుండవలెనని వారికొరకు మాత్రము నేను ప్రార్థించుట లేదు; వారి వాక్యము వలన నాయందు విశ్వాసముంచు వారందరును ఏకమై యుండవలెనని వారి కొరకును ప్రార్థించుచున్నాను" (యోహాను 17:20, 21).

తనయందు విశ్వాసముంచు వారందరును ఏకమై యుండవలెనని యేసు ఈ ప్రార్థనను చేసెను. తండ్రియైన దేవుడు కుమారుడైన క్రీస్తుతో ఎట్లుఏకమై యుండెనో ఆయన మనకు నిరూపించెను. క్రీస్తునందు తండ్రియు, తండ్రియందు క్రీస్తును లీనమైయుండిరి. తండ్రి వన్నియు కుమారునివి, కుమారునివన్నియు తండ్రివియని యేసు ప్రార్థించెను. వారి రాజ్యము ఒక్కటే వారి చిత్తము ఒక్కటే, అట్టి పరిపూర్ణ ఐక్యతను క్రీస్తుయొక్క అనుచరులు కలిగియుండవలెనని ఆయన ప్రార్థించెను. అయితే క్రీస్తు శిష్యులు అనేక డినామినేషనుల వలెను, శాఖలవలెను, గుంపులవలెను విడిపోయి వివిధనామములను, సిద్ధాంతములను, ఆచరణలను కలిగియున్న యెడల అట్టి పరిపూర్ణ ఐక్యత సాధించుట అసాధ్యము.

నేటి క్రైస్తవలోకము లెక్కలేని శాఖలవలె చీలిపోయి యుండుటవలన వారు యేసుచేసిన ఈ గొప్ప ప్రార్ధనను వ్యతిరేకించుచున్న వారని గమనించవలెను. క్రైస్తవులు మతశాఖల తత్వమును విసర్జించి ఏకమైయుండుట అత్యవసరము. వారు యేకమైయున్నయెడల ఒక సంగతి జరుగును అని క్రీస్తు తన ప్రార్ధనలో పేర్కొనెను. క్రైస్తవులు ఏకమైయున్న యెడల క్రీస్తును దేవుడు ఈలోకమునకు పంపెనని లోకము నమ్మునని క్రీస్తు ప్రార్థించెను. లోకము నంతటినీ క్రైస్తవులనుగా చేయవలెనన్న క్రీస్తు అనుచరులందరు ఏకమై యుండుట అత్యవసరము. ఈనాడు లోకమందున్న వారందరు క్రైస్తవులు కాకుండుటకు, తమలో తాము భేదాభిప్రాయములుగల క్రైస్తవులే కారకులని మనము గుర్తించుకొనవలెను.

మొదటి శతాబ్దములో కొరింధు పట్టణములో యన్న క్రైస్తవులు మధ్య విభజనలు రాగా అపో.పౌలు వాటిని ఖండించెను. అతడు వారికిట్లు బోధించెను: "సహోదరులారా, మీరందరూ ఏకభావముతో మాటలాడవలెననియు, మీలో కక్షలులేక యేకమనస్సుతోను, ఏకతాత్పర్యముతోను మీరు సన్నద్ధులై యుండవలెననియు, మన ప్రభువైన యేసుక్రీస్తు పేరిట మిమ్ములను వేడుకొనుచున్నాను. మీలో ఒకడు నేను పౌలువాడను, ఒకడు నేను అపొల్లోవాడను, మరియొకడు నేను కేఫావాడను, ఇంకొకడు నేను క్రీస్తువాడనని చెప్పుకొనుచున్నారని నా తాత్పర్యము. క్రీస్తు విభజింపబడి యున్నాడా? పౌలు మీకొరకు సిలువ వేయబడెనా? పౌలు నామమున మీరు బాప్తిస్మము పొందితిరా ?" యని అతడు వారిని మందలించెను. (1 కొరింధీ 1:10-13).

అపో.పౌలు ఈమాటలను పరిశుద్ధాత్మావేశము వలన లిఖించెను. గనుక క్రైస్తవులలో చీలికలను పరిశుద్ధాత్ముడు అతి ఖచ్చితముగా ఖండించెనని మనము తెలిసికొనవలెను. ఆనాటి క్రైస్తవులు ఆయా మనుష్యుల పేర్లనుబట్టి ఎట్లుచీలికలై పోయిరో ఈనాడుకూడా వారు అట్లే చీలికలై యుండిరి. అయితే అట్టి విభజనలను పరిశుద్ధాత్ముడు ఖండించుచున్నాడని మనము తెలిసికొనుట అత్యవుసరము. క్రైస్తవులు ఏకభావముతో మాట్లాడవలెననుటయేగాక వారు ఏకమనస్సు కలిగియుండవలెనని పరిశుద్ధాత్ముడు లిఖించెను: "మీరేకభావము గలవారై యుండవలెను" అని రోమా 15:5,6 లో అపో.పౌలు వ్రాసెను. "తుదకు సహోదరులారా, సంతోషించుడి సంపూర్ణులై యుండుడి, ఆదరణ కలిగి యుండుడి, ఏకమనస్సు గల వారై యుండుడి, సమాధానముగా ఉండుడి; ప్రేమ

సమాధా నములకు కర్తయగు దేవుడు మీకు తోడై యుండును" అని కొరింథీయులను అతడు హెచ్చరించెను (2 కొరింథీ 13:11). "మీరు ఏకమనస్కులగునట్లుగా ఏక ప్రేమకలిగి, యేకభావము గలవారుగా ఉండి, ఒక్కదానియందే మనస్సుంచుచు నా సంతోషమును సంపూర్ణము చేయుడి" యని అతడు ఫిలిప్పీ 2:3లో వ్రాసెను. "తుదకు మీరందరు ఏకమనస్కులై యొకరి సుఖ దు:ఖములయందు ఒకరు పాలుపడి, సహోదరప్రేమగలవారును, కరుణా చిత్తులును, వినయమనస్కులునై యుండుడి"యని అపో. పేతురు వ్రాసెను (1 పేతురు 3:8).

క్రీస్తు అనుచరులు ఐక్యత కలిగి యుండుటను గూర్చి లేఖనములు ఇంత విపులముగా బోధించుచున్నప్పుడు మనము విడిపోయి యుండుట లేఖనముల నతిక్రమించిన యట్లగును గదా? అందుకే తనను యథార్థముగా అనుసరించువారు ఏకమై యుండు నిమిత్తము క్రీస్తు ఒకే ఒక్క సంఘమును, తన సంఘమును స్థాపించెను. క్రైస్తవులకు క్రీస్తు సంఘము ద్వారానే తప్ప డినామినేషనుల ద్వారా ఐక్యత లభించుట దుస్సాధ్యము. ఏలాగు శరీరము ఏకమై యున్నను అనేక అవయవములు కలిగి యున్నదో, యేలాగు శరీరము యొక్క అవయవములన్నియు అనేకములైనను ఒక్క శరీరమైయున్నవో అలాగే క్రీస్తు ఉన్నాడు" (1కొరింథి 12:12). క్రైస్తవులందరు ఏకమై యుండుటకు "శరీరమొక్కటే, ఆత్మయు ఒక్కటే, అప్రకారమే మీ పిలుపు విషయమై యొక్కటే నిరీక్షణయందుండుటకు పిలువబడితిరి. ప్రభువు ఒక్కడే, విశ్వాసమొక్కటే, బాప్తిస్మ మొక్కటే, అందరికీ తండ్రియైన దేవుడు ఒక్కడే"యని ఎఫెసీ 4:4-5లో పౌలు ఒక గొప్ప ఐక్యత సూత్రమును లిఖించెను. వచ్చే పాఠాల్లో ఈసూత్రమును విపులముగ గమనించి ఈనాడు క్రీస్తులో ఐక్యతను మనము ఎట్లు సాధించగలమో గమనించెదము.

## పుల్లని పిండిని గూర్చిన ఉపమానము
## (The Parable of Leaven)

మత్తయి 13:33, లూకా 13:20-21

**పరిచయము :**

పుల్లని పిండిని గూర్చిన ఉపమానము జతగా చెప్పబడిన రెండు ఉపమానములలో ఒకటి. మొదటి దానిని గత పాఠములో గమనించాము. మత్తయి సువార్త 13వ అధ్యాయములో రాజ్యమును గూర్చి యేసు చెప్పిన ఏడు ఉపమానములలో అది ఒకటి.

**ఉపమానము :**

"ఆయన మరియొక ఉపమానము వారితో చెప్పెను. పరలోకరాజ్యము ఒక స్త్రీ తీసికొని పిండి అంతయు పులిసిపొంగు వరకు మూడు కుంచముల పిండిలో దాచిపెట్టిన పుల్లని పిండిని పోలి యున్నది" (మత్త 13:33).

పులి (leaven) అనగా పులిసిన పిండి. అదిముందేయున్న పిండిగాని, నిల్వ ఉండుటవలన పుల్లగా తయారయ్యెను. పూర్వకాలము ఈపులి ప్రత్యేకముగా లభ్యమయ్యేది కాదు. గనుక రొట్టెలు తయారు చేయునప్పుడు ఆ పిండిలో పాతదైన పులిసిన పిండిని కొంత కలిపేవారు. అప్పుడు ఆముద్ద అంతయు పులిసెను. బజారులో లభించే రొట్టెలు పులిపిండి ద్వారా పొంగినవే. గాని ప్రభురాత్రి భోజనములో మనము వాడే రొట్టె మాత్రము పులిపిండి లేనట్టిది. అది పొంగిన రొట్టె కాదు.

యేసు ఈపులిపిండిని తన రాజ్య విస్తరణకు ఉదాహరణగా ఈ ఉపమానములో వినియోగించారు. కొన్ని సమానాంతరములు 1) చిన్నమొత్తము వలన పెద్ద మొత్తమంతయు ప్రభావితమగును 2) ఈమార్పు క్రమ క్రమముగా జరుగును. అది స్థిరమైనది 3) పెరుగుదల అభివృద్ధి వక్కాణించబడెను. 4) స్వల్పారంభముతో గొప్ప ఫలితములు 5) ఈ మార్పు. ఫలితము నిశ్శబ్దముగా, అలజడి లేకుండా జరుగును 6) ఆపదార్థము దానికదే అభివృద్ధిజెందును 7) చివరకు దాని విస్తీర్ణత దృగ్గోచరమగును.

పులిపిండిని గూర్చిన లక్షణములను ఒక వ్యాఖ్యాన కర్త ఇట్లు వివరించాడు. 1) దాని అంతరంగిక ప్రభావము-పులిపిండి లోపలినుండి పనిచేయును. 2) మార్పుచేయు దాని లక్షణము. పులిపిండి ముద్ద అంతపులియు వరకు (అంటు రోగము వలె) తీవ్రముగా పనిచేయును, వ్యాపించును.

పులిపిండిని గూర్చి పాతక్రొత్త నిబంధనలు రెండింటిలోనూ రిఫరెన్సులు కనబడును. పాత నిబంధనలో పులిపిండిన గూర్చి అక్షరార్థముగానే గాని అలంకార రీతిగ ఎన్నడు చెప్పబడలేదు. దహన బలులన్నిటిలోనుండి పులిపిండి నిషేధించబడెను. బలిపీఠము మీదగాక యాజకుడు సేవించు ఏ అర్పణలోనైనను దానిని వినియోగించ వచ్చును. ఒక సందర్భములో తప్ప క్రొత్తనిబంధనలో పులిపిండిని గూర్చి ఎల్లవేళలా అలంకారరీతిగానే చెప్పబడెను (మత్తయి 16:12). యేసు అలంకార రీతిగా మాట్లాడితే, శిష్యులు ఆయన నిజంగా రొట్టెలను గూర్చియే చెప్పెనను కొనిరి.

పులిపిండిని గూర్చిన సందర్భములో అది ఏదో ఒక మంచిని సూచించుటక

కొడబడినదని తలంచుదురు. అయితే యూదులలో పులిపిండి సందర్భము ఎల్లప్పుడు చెడుగునే సూచించెను. అది దుష్టత్వాన్నే ఎల్లవేళలా సూచించెను. లేఖనములలో పులిపిండి చెడుగును సూచించుటకే వాడబడెననుట నిర్వివాదము (1కొరింథీ 5:7; లూకా 12:1).

క్రొత్త నిబంధనలో మంచికి, చెడుగుకు కూడ సూచనగా 'పులిపిండి' వాడబడెను. పులియ బెట్టుట (Fermentation) కుళ్ళు బెట్టుటతో సమానమని యూదులు తలంచేవారు. అందువలన దుష్ప్రభావమునకు గురుతుగా వారు పులిపిండిని ఎంచేవారు. అందువలన యేసు పరిసయ్యుల పులిసిన పిండిని గూర్చియు హేరోదు పులిసిన పిండిని గూర్చియు జాగ్రత్త పడుడని తన శిష్యులను హెచ్చరించెను (మార్కు 8:15). పౌలు కూడ కొన్ని సందర్భాలలో ఇట్లు హెచ్చరించెను. "పులిసిన పిండి కొంచెమైనను ముద్దంతయు పులియజేయునని మీరెరుగరా?'' (1 కొరింథీ 5:6, గలతీ 5:9). అట్లే పులిపిండిని మంచి ప్రభావముకు గురుతుగా కూడ యూదులు వాడేవారు మంచికైనను, చెడుగుకైనను సరే పులిసిన పిండి శక్తివంతమైన ప్రభావముగల పదార్థముగా పరిగణించబడెను.

క్రొత్త నిబంధనలో పులిసిన పిండిని గూర్చిన సందర్భము చెడుగుకు సూచనగానే వాడబడెను. 'మీరు అతిశయపడుట మంచిదికాదు. పులిసిన పిండి కొంచెమైనను ముద్ద అంతయు పులియజేయునని మీరెరుగరా? మీరు పులిపిండిని తీసిపారవేయుడి. అంతేకాక క్రీస్తు అను మన పస్కాపశువు వధింపబడెను. గనుక పాతదైన పులిపిండితోనైనను దుర్మార్గతయు దుష్టత్వమునను పులిపిండితోనైనను కాకుండ నిష్కాపటమును సత్యమునను పులియని రొట్టెతో పండుగ ఆచరింతము (1 కొరింథీ 5:6-8).

యేసు చెప్పిన ఉపమానములో పులిపిండిని గూర్చిన సందర్భము మంచికే ఉదహరించబడితే బైబిలులో అదొక్క సందర్భము మాత్రమే యున్నది. ఈ ఉపమానములో పులిపిండి చెడుగును సూచించుటకు వాడబడలేదు. అది సదుద్ధేశ్యముతోనే ఈ ఉపమానములో వాడబడెను. ఇక్కడ పులిపిండి దేవుని వాక్యముతో సమానము. అది దేవుని రాజ్య విత్తనము (లూకా 8:11). యెహోవా ధర్మశాస్త్రము (కీర్తన 119:11). అది సువార్త, రక్షించుటకు దేవుని శక్తియై యున్న సువార్త (రోమా 1:16). పిండి ముద్దలో వేయబడిన పులిదానినంతటిని ఎట్లు ప్రభావితము చేయునో అట్లే మంచి మనస్సుగలవాని జీవితమును సువార్త కూడ ప్రభావితం చేయును.

పాపముతో మనక బారిన ఈలోకంలో దేవుని రాజ్యాభివృద్ధిని, దాన్ని వ్యాప్తిని సూచించుటకుగాను ఈ ఉపమానములో పులిపిండిని గూర్చి చెప్పబడెను. సువార్త వలన మన జీవితములు దైవికముగా ఎంతగా మార్చబడునో అంతగా ఈలోకంలో మన ప్రభావముండును. ప్రతి క్రైస్తవుడు ఇతరులకు బోధించుటద్వారా పులిపిండివలె పని చేయుచు దేవుని రాజ్యవ్యాప్తి కొరకు కృషిచేయాలనునది దేవుని సంకల్పము (2తిమోతి 2:2,24).

ప్రపంచ వ్యాప్తమైన ఈ రాజ్యము యొక్క ప్రత్యేక లక్షణం యేమంటే. పులిపిండివలె అది దానికదే వ్యాపించును. ఆదిమ సంఘము (రాజ్యము) నిజానికి దానికదే అతిత్వరితముగా వ్యాప్తి జెందెను (అపొ.కా. 2:41,47; 4:4;5:14; 6:1, 7; 9:31 11:23,24; 12:24; 16:5; 19:20).

ఈ ఉపమానములో చెప్పబడిన స్త్రీని గూర్చి, మూడు కుంచముల పిండిని గూర్చి వ్యాఖ్యాన కర్తలు వేర్వేరుగ చెబుతారు. వాటిలో ప్రత్యేకత యేమీ లేకపోయినా సాధారణంగా రొట్టెలు చేయుటకు కనీసం మూడు కుంచముల పిండిని వాడేవారు (ఆదికా 18:6). అదే రీతిగ ఈ ఉపమానములో యున్న స్త్రీ ప్రత్యేకత యేమీ లేదు. ప్రతి యింటిలోను స్త్రీలు ఎట్లు పిండిని పిసికి ముద్ద చేయుదురో ఆ సందర్భమునే యేసు ఇక్కడ వినియోగించెను. యూదుల ఆహారములో రొట్టెలు ముఖ్యభాగము. ఈ దృశ్యాన్ని యేసు మాటలు వినేవారందరు చూచినదే, ఎరిగినదే.

ఒకటి మాత్రము గమనించాలి. అదేమంటే దేవుని రాజ్యము వ్యాపించాలంటే దానిలో మానవుని పాత్ర కూడ యున్నదనే భావాన్ని ఈస్త్రీ ఇక్కడ మనకు సూచించుచున్నది. బైబిలులో యున్న యితర లేఖన భాగాలలో ఈభావార్థము సరిపడుచున్నది (అపొ.కా. 2:14, 37-47; 8:5, 8,12, 26-40; 9: 22-16; 10; 11:14). పిండిముద్దలో పులిసిన పిండి ఉద్దేశ్యపూర్వకముగా చేతులతో ఉంచబడును. అదేరీతిగా మనుషుల హృదయాలలో సువార్త వాక్యము నాటబడుటకు మానవ కృషి అవుసరము. మంటి ఘటములలో సువార్త ఐశ్వర్యము ఉంచబడినట్లు పౌలు చెప్పాడు (2 కొరింథీ 4:7). రక్షించు సువార్త వాక్యము మానవుల ద్వారా ప్రకటించబడాలని దేవుడు నిశ్చయించారు (1కొరింథీ 1:18-21).

"ఎందుకనగా ప్రభువు నామమును బట్టి ప్రార్థన చేయుడాడెవడో వాడు రక్షింపబడును. వారు విశ్వసింపనివానికి ఎట్లు ప్రార్థన చేయుదురు ! వినని వానిని

ఎట్లు విశ్వసించుదురు? ప్రకటించువాడు లేకుండ వారెట్లు విందురు ? ప్రకటించు వారు పంపబడని యెడల ఎట్లు ప్రకటిం చుదురు? ఇందు విషయమై ఉత్తమమైన వాటిని గూర్చిన సువార్త ప్రకటించువారి పాదములెంతో సుందరమైనవి అని వ్రాయబడి యున్నది. అయినను అందరు సువార్తకు లోబడలేదు. ప్రభువా మేము తెలియజేసిన సమాచారము ఎవడు నమ్మెను? అని యెషయా చెప్పుచున్నాడు గదా? కాగా వినుటవలన విశ్వాసము కలుగును; వినుట క్రీస్తును గూర్చిన మాట వలన కలుగును" (రోమా 10:13-17).

బాల్యదశలో యున్న సంఘము (రాజ్యము) యొక్క అభివృద్ధిలో ప్రకటిం చుట ప్రాముఖ్యమై యుండెను. ఈ లోకము నకు దేవుడు అందించుసువార్తలోవాడబడు నోరు, చేతులు, కాళ్లు క్రైస్తవుని నోరు, చేతులు, కాళ్లు(మార్కు 16:15-16). క్రొత్త ముద్దలో దాచిన, యుంచిన పులిపిండి మొదలగునవి సువార్త వాక్యము పరలోకము నుండి తీసికొని రాబడి నశించిన ఈలోకములో యుంచబడు సందర్భమును సూచించుచున్నవి (యోహాను 1:17). ఆ సువార్త లోకములో మార్పు కలుగ జేయును (అపొ.కా. 3:19; 1కొరింథీ 6:9-11; కొలస్స 1:13). ఈలోకము నుండి గాక దానికి వేరైయున్న ఆత్మీయ రాజ్యము అట్లు స్థాపించబడెను (యోహాను 18:36).

"పిండి అంతయు పులిసి పొంగువరకు" అను మాటలు విజయ వంతమైన రాజ్యమును గూర్చి చెప్పబడిన ప్రవచనాత్మక మాటలు (మత్తయి 16:18). ఈలోకమంతటి కొరకు యేసు మరణించారు (యోహాను 3:16), రక్షణ కొరకు సువార్త యిచ్చు షరతులకు అనేక ఆత్మలు లోబడుచున్నారు. (మత్తయి 24:14; కొలస్స 1:13), విచారం యేమంటే విచక్షణ జ్ఞానం కలిగిన అనేకమంది నశింతురు (మత్తయి 7:13-14), సంతోషం ఏమంటే అసంఖ్యా కమైన ఆత్మలు పరలోక బహుమతిని పొందుదురు ప్రకటన 7:9).

ముగింపు :

ఆవగింజ ఉపమానమువలె పులిసిన పిండిని గూర్చిన ఉపమానము సంఘాభివృద్ధిని గూర్చి ప్రవచనాత్మ కముగా చెప్పబడిన ఉపమానము. యేసు ఈ ఉపమానములు చెప్పుసరికి తన రాజ్యమైన సంఘము ఇంకా స్థాపించబడలేదు.

\- లూయిస్ రష్‌మోర్

# సాతాను రాజ్యం నాశనం గావించబడుట
## (Satan's Kingdom Destroyed)

పరమందొక దేవుడున్నారు. ఆయన ఎట్లుంటారు? ఆయన మంచి వాడు, నమ్మదగిన వాడు, పరిశుద్ధుడు, సర్వశక్తిమంతుడు. అయితే అపవాది పరిమితి గల శక్తిమంతుడే అయినను దేవుని యొక్కయు నీతిమంతుల యొక్కయు శత్రువని మనం నేర్చు కొనియున్నాము. ఈలోకంలో యున్న దుష్టత్వాన్ని కంతటికీ అతడే బాధ్యుడు.

మొదటి మానవుడైన ఆదాము పాపము చేయునట్లు అపవాది శోధిం చాడు. మరియు దేవుని కుమారుడైన యేసుక్రీస్తు ఈలోకమునకు వచ్చి నప్పుడు ఆయనను శోధించి నాశనం చేయాలని సాతానుడు నిశ్చయించు కొన్నాడు. యేసు ఆకలి గొనగా రాళ్లను రొట్టెలుగా చేయు మని అపవాది ఆయనను గురిచేసిన మొదటి శోధనను ఇదివరకే గమనిం చాము. "మనుష్యుడు రొట్టెవలన గాక దేవుని నోటనుండి వచ్చు ప్రతిమాట వలన జీవించును అని వ్రాయబడి యున్నదని" యేసు వానికి జవాబిచ్చారు (మత్తయి 4:4). దేవుని వాక్యము రెండంచులుగల ఖడ్గముకంటె వాడి యైనది గనుక లేఖనముల నుండి క్రీస్తు అపవాదికి జవాబు చెప్పగా, వాడు మారుమాట చెప్పలేకపోయెను.

**క్రీస్తు యొక్క ఆత్మీయ జీవితాన్ని సాతాను భంగపరచ ప్రయత్నించాడు :**

అయితే సాతాను క్రీస్తుపై చేసిన తదుపరి దాడిలో లేఖనములనే వినియో గించాడు. అపవాది ఆయనను దేవాలయ శిఖరమున నిలువబెట్టి నీవు దేవుని కుమారుడవైతే క్రిందికి దుముకుము. ఆయన నిన్ను గూర్చి తన దూతల కాజ్ఞా పించును. నీపాదమెప్పుడైనను రాతికి తగుల కుండ వారు నిన్ను చేతులతో ఎత్తుకొందురు అని వ్రాయబడి యున్నదని ఆయునతో చెప్పెను" (మత్తయి 4:6).

"అని వ్రాయబడియున్నది"యని అపవాది క్రీస్తుతో పలికాడు. ఇంకోమాటలో నీవు లేఖనముల యందు నమ్మికకలిగి యున్నావు గనుక దీని సంగతి యేమి? యని వాడు కూడ లేఖనాలనే విని యోగించాడు. శోధించుటకు సాతాను యేసును ఎక్కడికి తీసుకెళ్లాడు? క్రీస్తును అరణ్యపు రోదన నుండి హింస నుండి వేరు చేసి దేవుని ఆలయానికి తీసికొని పోయాడు. శరీరసంబంధమైన ఆకలిని నివృత్తి చేసికోమని అతడిచ్చిన సలహా పని చేయలేదు గనుక క్రీస్తుకున్న అతిపవిత్ర తలంపులను, ఆయన ఆత్మీయ జీవితాన్ని భంగపరచనెంచాడు. 'నీవు క్రిందికి

దుముకుము' అని అతడు క్రీస్తుకు చెప్పాడు. దేవాలయశిఖరము నుండి బహుశ ఆయన ఆరాధించువారినందరినీ చూడగలిగెను. దూతల చేతుల మీదుగా క్రీస్తువారి మధ్యకు దిగితే వారందరికీ ఆయన దేవుని నుండి దిగి వచ్చారని బహిరంగముగా ప్రదర్శించాలని వాడుకోరాడు. "ఆయన నిన్ను గూర్చి తన దూతల కాజ్ఞాపించును. నీపాదమెప్పుడైనను రాతికి తగులకుండ వారు నిన్ను చేతులతో ఎత్తి కొందురు". తద్వారా నీవువారి విమోచకుడవని గుర్తిస్తారు అని వాడు ఆయనను శోధించాడు.

అపవాది పలికిన ఈమాటలు సత్యమని క్రీస్తుకు తెలుసు. ఆయన దానిని కాదనలేదు, గాని అపవాది లేఖనములను వక్రీరించుచున్నాడని కూడ ఆయనకు తెలుసు, అందువలన, "ప్రభువైన నీదేవుని శోధింపవలదని మరియొక చోట వ్రాయబడి యున్నదని ఆయన వానితో చెప్పెను" (మత్త 4:7). సత్యవాక్యమును మనము సరిగ ఉపదేశించాలని చెప్పబడినది (2తిమో 2:15). మరియు లేఖనములను అపార్థము చేయరాదని కూడ మనకు చెప్పబడినది (2 పేతురు 3:16). దేవుడు చెప్పిన దంతయు క్రీస్తు ఎరుగును గనుక ఆయన అసత్యమును ఎదిరించారు. అయితే అనేకులు ఈపాఠాన్ని నేర్చుకోలేదు. మతసంబంధ విషయాల్లో ప్రతి సంగతి యదార్థమనుకొంటాము, గాని ఆత్మీయ విషయాలను వక్రీకరించుట సాధ్యమని క్రీస్తు చూపించారు. దుష్టత్వము, దుర్మార్గులవలె అక్రమ మతములు, అబద్ధ సంఘములు అనేకములు నేడున్నాయి.

**క్రీస్తుగనుకలోబడితే తనకు గొప్ప విలువయని అపవాది ఎరుగును :**

క్రీస్తుయొక్క భౌతికావుసరములను తీర్చే విమోచకుడనని మొదటి శోధనలో సాతానుడు నటించాడు. రెండవ శోధనలో ఆత్మీయ నడిపింపు ననుగ్రహించే మార్గదర్శకుడనని మరీనటించాడు. గాని చివరిశోధనలో అతడు నటించుట మానివేసాడు. క్రీస్తు దేవుని చిత్తప్రకారమేనడుచుటకు నిశ్చయించుకొనినట్లు గమనించాడు. గాని క్రీస్తు సాతాను చిత్తప్రకారము నడుచుకొని అతని యిష్టాయిష్టాలకు తలొగ్గి ఆయన వానికి నమస్కారము చేయాలని కోరాడు. వాడు ఈలోకాధిపతి గనుక ఆయన అట్లు చేస్తే ఈలోక రాజ్యములను వాటిమహిమను ఆయనకిచ్చుటకు సిద్ధపడ్డాడు. క్రీస్తు గనుక వానికిలోబడితే, అది ఈలోక మంతటి కంటె గొప్పయని సాతానుడు ఎరుగును, వాడు దేవునితో బద్ధవిరోధము కలిగి, గొప్పపోరాటము సల్పుచున్నాడు. వాడు దేవునికి విరోధముగా తిరుగుబాటును నడిపించుచున్నాడు. క్రీస్తు దేవుని ఏకైక

కుమారుడు గనుక క్రీస్తును తన వైపు లోబరచుకొనడానికి ఈలోకమంతటిని ఇచ్చుటకు ఇచ్ఛయించాడు. ఈ విషయంలో వాడు జయిస్తే, తన తిరుగుబాటుకూడ విజయంసాధించుననుకొన్నాడు. క్రీస్తు గనుక సాతానును ఆరాధిస్తే, ఈలోకాన్నంతటిని ఆయనకు ఆశ చూపాడు. ఈశోధన ద్వారా సాతానుడు అనేకులను జయించాడు. ఈలోక సంపదను, రాజ్యాధికారాన్ని సంపాదించుట కొరకు అనేకులు పాపములోబడ్డారు. గాని క్రీస్తు ఒక్కక్షణం కూడ తడబడలేదు. ఆయన మరల లిఖిత పూర్వక దేవుని వాక్యమును ఎత్తి చూపించార్రు. ప్రభువైన నీదేవునికి మ్రొక్కి ఆయనను మాత్రము సేవింపవలెను అని వ్రాయబడియున్నదని" ఆయన వానితో చెప్పెను (మత్తయి 4:10). ఆయన అంతటితో ఆగిపోక, "సాతానా పొమ్ము" అని వానిని గద్దించెను.

ఈలోకరాజ్యములన్నిటిపై తానే సర్వాధికారినని సాతానుడు చెప్పుకొన్నాడు, వాడు ఈలోకాధిపతియని పిలువబడ్డాడు. గాని వాని శక్తి అంతా దురాక్రమణ వలన కలిగినదే, దానిని కొనసాగించేహక్కు వానికి లేదు. గనుక సాతానా పొమ్ము అని క్రీస్తు ఆజ్ఞఇయ్యగానే వాడు మాత్రము క్రీస్తుకులోబడవలసివచ్చెను. ఏలయనగా ఆయనే ఈలోకానికంతటికి నిజమైన అధిపతి. సాతాను కొంతకాలము విడిచిపోయెను. ఇదిగో దేవదూతలు వచ్చి ఆయనకు పరిచర్య చేసిరి (మత్తయి 4:11).

**క్రీస్తును ఓడించడానికి నరకములోని దూతలను సాతాను పోగు చేసెను :**

సాతానుపై క్రీస్తు సాధించిన విజయము అనేక విజయాలకు దారి తీసి చివరకు క్రీస్తుఎందునిమిత్తము ఈలోకమునకు వచ్చెనో అందుకు అనగా సాతానును నాశనము చేయుటకు నడిపించెను. క్రీస్తు ఈలోకములో జీవిస్తు యుండగా ఆయన దయ్యములను వెళ్లగొట్టెను. సాతాను తన దూతలన్నిటిని పోగుచేసి మనుష్యులను అద్భుతరీతిగా పీడించునట్లు చేసి క్రీస్తు యొక్క పనిని ఎదుర్కొనజూచెను. గాని దేవుడు ప్రవక్తయైన జెకర్యా ద్వారా దేశములో అపవిత్రాత్మ లేకుండ వెళ్ల గొట్టుదునని ముందుగనే ప్రవచించెను (జెకర్యా 13:2).

**క్రీస్తు సాతాను యింటిలో ప్రవేశించి వానిని నాశనము చేసెను :**

యేసుక్రీస్తు దేవుని నిజదూతవలె దేవుని నుండి వచ్చిగొప్పప్రవచన గొలుసును చేతబట్టుకొని సాతానును బంధించి వానిని అగాధములో పడవేసెను (ప్రకట 20:1,2). పాపమును అపవిత్రతను పరిహరించుటకు ఒక ఊట తీయబడగా యిది సంభవింపవలసి యుండెను (జెకర్యా 13:1-2). అనగా క్రీస్తు సిలువపై పాపక్షమాపణ కొరకు తన రక్తమును

చిందించినప్పుడిది సంభవించెను. ఈసంగతి అంతా అపవిత్రాత్మలకు తెలుసు. అందు వలన అవి క్రీస్తును చూచి "ఇదిగో దేవుని కుమారుడా, కాలమురాకమునుపే మమ్మును బాధించుటకు ఇక్కడికి వచ్చితివా?" యని కేకలు వేసేవి (మత్తయి 8:29). పాతాళములోనికి పోవుటకు తమకు ఆజ్ఞాపింపవద్దని అవి ఆయనను వేడుకొనేవి (లూకా 8:31). గాని యేసు బలవంతుని (సాతాను) యింట ప్రవేశించి వానిని బంధించుటకును, వాని యిల్లును నాశనము చేయుటకును వచ్చెను(మార్కు 3:27). యేసు అపవిత్రాత్మను వెళ్లగొట్టిన ప్రతిసారి ఆబలవంతుని యింట ప్రవేశించెను. యిదంతా సాతానును నాశనం చేసే ఆయన పనిలో భాగమే.

**క్రీస్తుమరణమే సాతాను యొక్క గొప్ప అపజయము :**

అయితే సాతాను కూడ క్రీస్తును నాశనము చేయుటకు సంకల్పించుకొన్నాడు. శాస్త్రులు, పరిసయ్యులు సద్దూకయ్యుల ద్వారా సాతాను క్రీస్తును ప్రతివిధముగా వ్యతిరేకించెను. చివరిగా ఆయన శిష్యులలో ఒకని దురాశ వలన క్రీస్తు అప్పగింపబడి చంపబడెను. పరలోక సైన్యములు దుఃఖించిరి గాని సాతాను వాని దూతలు సంబరపడిరి. అయితే మరణము ద్వారా క్రీస్తు సాతాను యొక్క యింటిలో ప్రవేశించెను. ఆయన పరలోకమునకు ఆరోహణుడు కాకముందు భూమియొక్క క్రింది భాగములకు దిగెనని ఎఫెసీ 4:9 చెప్పుచున్నది. క్రీస్తును చంపి తాను దేవునిపై జరిపేతిరుగుబాటులో గొప్ప విజయాన్ని సాధించానని సాతాను తలంచాడు గాని అదే వానియొక్క గొప్ప అపజయము.

**మరణ బంధకములను క్రీస్తు ఛేదించెను :**

పాపము వలన వచ్చు జీతము మరణము (రోమా 6:23). అయితే క్రీస్తు ఏపాపము చేయలేదు (2 కొరింథీ 5:21). గనుక ఆయనను మరణము బంధించి యుంచలేదు (అపొ.కా. 2:24). ఆయన మరణబంధకములను ఛేదించెను. ఆయన ప్రధానులను అధికారులను నిరాయుధులనుగా చేసి వారిపై బాహాటముగా విజయము సాధించెను (కొలస్స 2:15). ఆయన మరణమును జయించి విజేయుడై చెరపట్టబడినవారిని విమోచించెను (ఎఫెసీ 4:8). మరణము యొక్కయు పాతాళము యొక్కయు తాళపు చెవులు ఆయన కలిగి యున్నానని ప్రకటించెను (ప్రక 1:18).

**క్రీస్తు మరణమే సాతాను దేవునికి చెల్లించిన గొప్ప ఘనత :**

క్రీస్తును చంపుట ద్వారా సాతాను డు తెలియనిరీతిగా దేవునికి గొప్ప ఘనత చెల్లించెను. ఏలయనగా క్రీస్తు మరణము ద్వారా చిందింపబడిన ఆయన రక్తము

ద్వారా మన పాపముల క్షమాపణ సాధ్యమాయెను. సాతాను యొక్క యిల్లు మరింత గొప్పగా నాశనమగుట దీని వలన సాధ్యమాయెను. ఆయన ఆజ్ఞలకు లోబడినవారు నీటిమూలముగను ఆత్మమూలముగను తిరిగి జన్మించిన వారై (యోహాను 3:5), సాతాను రాజ్యమును విసర్జించి, వానిని తమ దేవునిగా నిరాకరించి దేవుని రాజ్యములో ప్రవేశింతురు. అక్కడ సాతాను బంధించబడి యున్నాడు ఏలయనగా క్రైస్తవులు సహించ గలిగినంతకంటె ఎక్కువగా శోధింపబడ కుండా దేవుడు వారిని కాపాడును (1కొరింథీ 10:13). ఈరీతిగా క్రైస్తవులు హృదయములలో సాతాను యొక్క రాజ్యము నాశనము గావించబడినది. ఏలయనగా వారి జీవితములు పాపమువలనను, సాతాను వలనను గాక క్రీస్తు వలనను ఆయన నీతిసూత్రముల వలనను నడిపించబడును.

## దేవుడతని మొత్తెను
## (God Struck him)

"వారు నాకోను కళ్లము దగ్గరకు వచ్చినప్పుడు ఎడ్లకు కాలు జారినందున ఉజ్జా చేయి చాపి దేవుని మందసమును పట్టుకొనగా యెహోవాకోపము ఉజ్జా మీద రగులుకొనెను. అతడు చేసిన తప్పును బట్టి దేవుడు ఆక్షణమందే అతని మొత్తగా అతడు అక్కడనే దేవుని మందసమునొద్దపడి చనిపోయెను" (2 సమూయేలు 6:6-7).

దేవుని మందసమును ఫిలిష్తీయులు పట్టుకొని యుండిరి. మందసమును ఆదేశములో వారు ఎక్కడికి కొనిపోయినను, అక్కడి వారికి శ్రమసంభవించెను. చివరిగా ఆమందసమును ఒక క్రొత్తబండి మీద ఎక్కంచి దానిస్థానమునకు తిరిగి పంపించుటకు ఫిలిష్తీయులు నిశ్చయించుకొనిరి. బెత్షెమెషువారు యెహోవా మందసమును తెరచి చూచినందున దేవుడు వారిని హతము చేసెను (1సమూ 6:19). దేవుడు తన పరిశుద్ధ పరికరములను గూర్చి ఖండితముగా హెచ్చరికలనిచ్చెను. అట్టి వాటిని చూచుట గాని, ముట్టుకొనుట గాని లేవీయులు సయితము చేయకూడదు (సంఖ్యా 4:15,20).

అబీనాదాబు యింటిలో యున్న దేవుని మందసమును ఇప్పుడు దావీదు యెరూషలేముకు రప్పించాలనుకొన్నాడు. అందు వలన వారు నిబంధన మందసమును ఒక క్రొత్తబండిమీద ఎక్కించగా అబీనాదాబు యొక్క కుమారులగు ఉజ్జాయును అహ్యోయును ఆ క్రొత్తబండిని

తోలిరి. వారు నాకోనుకళ్లము దగ్గరకు వచ్చినప్పుడు ఎడ్లకాలు జారినందున ఉజ్జాచేయిచాపి దేవుని మందసమును ముట్టుకొనెను. అతని అలోచన మంచి దేనా ? తప్పకుండా మంచిదే ! గాని పరిశుద్ధమైన దానిని అతడు ముట్టు కొన్నాడు. దేవునికి అవిధేయత చూపాడు. మరణము చేత అతడు శిక్షించబడ్డాడు.

దేవుని మందసము ఒక చోట నుండి ఇంకొకచోటకు ఎట్లు మార్చాలో ఇశ్రాయేలీయులు దేవుని హెచ్చరికలను మరిచారు. దానిని మోతకర్రలమీద మోయవలెను (నిర్గమ 25:12-15; 37:1:5). ఫిలిష్తీయులు మందసమును క్రొత్తబండి మీద ఎక్కించి పంపించినట్లు బహుశ వారును తలంచి యుండ వచ్చును. లేదా ఈవిషయంలో దేవుని హెచ్చరికలు అంతప్రాముఖ్యము కాదేమోనని తలంచి యుండ వచ్చును. తత్ఫలితముగా మరణము సంభవించినది. అవును, ఉజ్జాతప్పుచేసాడు, అలాగే ఇశ్రాయేలీయులును తప్పు చేసారు. యెహోవా ఉజ్జాకు ప్రాణోపద్రవము కలుగుజేయగా దావీదు వ్యాకులపడెను (8వ).

అప్పుడు మందసము ఓబెదెదోము యింట ఉంచబడెను. యెహోవా ఒబెదెదోమును అతని యింటివారిని ఆశీర్వదించుచున్నాడని దావీదు వినెను. గనుక ఈసారి దేవుడు చెప్పినట్లే లేవీయుల చేత మోయించుకొని అది తీసికొని పోబడెను (1దినవృ 15:13-16). దేవుని మందసము సంతోషముతో యెరూషలే ముకు కొనితేబడెను. దావీదును, జనులు ను దేవునికి స్తుతిచెల్లించుచు ఆయన యందు ఆనందించిరి.

**దీనిలో మనం నేర్చుకొనదగు పాఠము లున్నాయా ?**

1. దేవుని హెచ్చరికలను నిర్లక్ష్యము చేస్తే మరణం సంభవిస్తాది.
2. మానవులు పాపము చేస్తే దేవుడు శిక్షిస్తారు.
3. దేవుడు చెప్పింది, చేసేది మనకు ఇష్టంలేకపోయినను దేవుడే ఎల్ల వేళలారైటు.
4. దేవుని ప్రజలు దేవుని షరతులను నిర్లక్ష్యము చేసినను, మారుమనస్సు పొంది ఆయన చెప్పినట్లు చేస్తే సంతోషము కలుగును.

అదేరీతిగా మన ఆరాధన విషయం లో దేవుని హెచ్చరికలను బట్టి నడుచు కొందము. ఆయన చెప్పిన రీతిగా అరాధించకపోతే దేవునికి మనం అవఘనత కలుగు జేయుదుము. మానవుని మార్గము దేవునిని ఎప్పుడు సంతోష పెట్టదు. మనం ఆయనచే సృజింపబడిన వారము గనుక ఆయన చెప్పినట్లే ఆయనను మనం సేవించాలి. అట్లు చేయకపోతే నాశనము, మరణము సంభవించును.

-లోయ్‌మిట్టల్

# గొప్ప నైతిక బోధకుడు మాత్రమేనా ?
## ( A great Moral Teacher only ?)

ఈలోకం ఎరిగిన మహోన్నతమైన ఏకైక వ్యక్తి యేసుక్రీస్తు. ఎవడు చేయలేని రీతిగా ఈయన తన బోధలతో లోకాన్ని ప్రభావితం చేసారు.

ఆయన తనకు తానేసాటియైన గొప్ప నైతిక బోధకుడు. ఆయన గొప్ప అధికారముతో బోధించారు. ఫలానా సంగతి చెప్పబడుట మీరు విన్నారు గదా, అయితే "నేను చెప్పునదేమనగా ..."యని బోధించేవారు. సామాన్య ప్రజలు అర్థంచేసి కొనునట్లు ఆయన చాలా సులభశైలిలో బోధించారు గంభీరమైన లోతైన భావాలను ఆయన బోధించారు. మీశత్రువులను ప్రేమించుడి. మిమ్మును ద్వేషించు వారికి మేలు చేయుడి" (లూకా 6:27). ఆయన ప్రజ్ఞవలన తరచు తన శత్రువులను సద్దణపారు: "కైసరువి కైసరుకు దేవునివి దేవునికిని చెల్లించుడి" (మత్త 22:21). ఆయన బోధ ఖచ్చితం, అను సరణీయం. మంచి సమరయుని గూర్చిన ఉపమానము చెప్పి యేసు "నీవును వెళ్ళి ఆలాగు చేయుమని" తనను ప్రశ్నించిన వానికి ఉపదేశించారు (లూకా 10:37).

యేసు బోధలను విన్నవారు ఆశ్చర్య పోయేవారు. ఆయన ఎక్కడకు వెళ్ళినా ఆయన వెంట వేళ్లేవారు. "ఆయన మాట్లాడినట్లు ఏమనుష్యుడు ఎన్నడు మాట్లాడలేదని" చెప్పుకొనేవారు. (యోహాను 7:46). వారి యభిప్రాయము సరియైనదే.

యేసుబోధలో మరొక సంగతి ప్రత్యేకమైనది. మానవ జాతికి అత్యున్నత ప్రమాణములనుపదేశించుటయే గాక, వాటిని ఆయనే అనుసరించేవారు. ప్రజలు తమ శత్రువులను ప్రేమించుమని చెప్పుటయే గాక, తనను సిలువ వేసిన వారిని ఆయన క్షమించారు. తమ మిత్రుల కొరకు ప్రాణము పెట్టాలని బోధించుటయే గాక నిజానికి ఆయనే తన ప్రాణమును వారి కొరకు అర్పించెను. అందువలన ఆయన బోధకులకు బోధకుడాయెను.

అయితే యేసు కేవలము నైతిక బోధకుడు మాత్రమే కాదు. అంతకన్నా ఆయన గొప్పవాడు. ఆయన మనుష్యుల పాపములను క్షమించువాడనని చెప్పే వారు. ఆయన ఆరాధనీయుడని, ఆయన మాత్రమే దేవుని ప్రతినిధియని, తాను మాత్రమే దేవుని యొద్దకు మార్గమని, జీవమని, సత్యమని, నశించిన పాపులను వెదకి రక్షింప వచ్చితినని, అనేకుల పాపవిమోచన కొరకు తన ప్రాణము వర్పింతునని, చనిపోయి తిరిగి లేతునని, తీర్పు దినమున మానవులందరూ

ఆయనకు జవాబు చెప్పవలసి యుండునని బోధించారు.

క్రొత్త నిబంధనలోని నాలుగు సువార్తలు యేసు మానవాతీతుడనే రుజువులతో నిండియున్నవి. ఆయన ఆరోపణలు సత్యమా? అట్లయితే ఆయన గొప్ప బోధకుని కంటే గొప్పవాడు, అతీతుడు. ఆయన మానవ శరీరాకారములో వచ్చిన దేవుని కుమారుడు. ఆయన అసత్యవంతుడైతే ఆయన గొప్ప బోధకుడెట్లవుతాడు?

ఆయన ఎవరు? ఆయన బోధనలను, ఆరోపణలను అంగీకరించాలి లేదా తిరస్కరించాలి. ఆయన తన్ను గూర్చి చెప్పిన సంగతులను నిరాకరిస్తే ఆయన గొప్ప బోధకుడని, రక్షకుడని కూడా నిరాకరించాలి.

-టామ్ కెల్టన్

## యేసును ఆరాధించుట
## (Worshipping Jesus)

యోహాను సువార్త ఆరంభములోనే యేసు యొక్క పూర్వపు ఉనికిని గమనించ గలము. "ఆదియందు వాక్యముండెను, వాక్యము దేవుని యొద్ద ఉండెను, వాక్యము దేవుడై యుండెను.... ఆ వాక్యము శరీరధారియై కృపాసత్య సంపూర్ణుడుగా మన మధ్య నివసించెను" (యోహాను 1:1,14).

యేసు దేవుడు గనుక, దేవుని వలె ఆరాధింపబడెను. తూర్పు దేశము నుండి వచ్చిన జ్ఞానులు యెరూషలేమునకు వచ్చి "యూదుల రాజుగా పుట్టిన వాడెక్కడ నున్నాడు ? తూర్పు దిక్కున మేము ఆయన నక్షత్రమును చూచి ఆయనను పూజింప వచ్చితిమని చెప్పిరి" (మత్తయి 2:2). తురువాత వారు యేసు ఉన్నచోటికి వచ్చి తల్లియైన మరియను ఆ శిశువును చూచి సాగిలపడి ఆయనను పూజించి తమ పెట్టెలు విప్పి బంగారమును, సాంబ్రాణిని, బోళమును కానుకలుగా ఆయనకు సమర్పించిరి" (మత్త 2:11).

మానవులు యేసును ఎందుకు ఆరాధించాలి? అపవాదిచే ఆయన శోధింపబడినప్పుడు, యేసు సాతానుతో "ప్రభువైన నీ దేవునికి మ్రొక్కి ఆయనను మాత్రము సేవింపవలెను" అని చెప్పెను (మత్త 4:10). యేసు దేవుడా ? దేవుడు కాకపోతే ఆయనను మనం ఆరాధించనే కూడదు. ఆయన దేవుడైతే మనం ఆయనను ఆరాధించడమేగాక, ఆయనను ఆరాధింప బాధ్యులం !

యేసు దేవుడైతే ఆయనకర్పింపబడు ఆరాధనను ఆయన స్వీకరిస్తారు. ఆయన దేవుడు కాకపోతే ఆయన నారాధించడం దేవ దూషణయే. ఏలయ

నగా దేవుడొక్కడే ఆరాధనీయుడు.

మొదటి శతాబ్ధములో యేసును దేవుడని గుర్తించి ప్రజలు ఆయనను ఎందుకు ఆరాధించారు? నేడు కొందరు ఆయన వారమనే చెప్పుకొంటారు గాని ఆయనను ఆరాధించుటకు నిరాకరిస్తారు. యిదేల?

మొదటి శతాబ్ధములో కుష్ఠరోగి ఒకడు ఆయన యొద్దకు వచ్చి ఆయనకు మ్రొక్కాడు (మత్త 8:2). ఆ కుష్ఠరోగి తడబడలేదు. ఆయన నారాధించుటలో అతడు ఏకాకి కాడు. మరొక సందర్భములో ఒక అధికారి వచ్చి ఆయనకు మ్రొక్కాడు (మత్తయి 9:18). ఆయననారింధించిన వారు "నిజముగా నీవు దేవుని కుమారుడవు" అని పలికారు (మత్త 14:33). మరొక సందర్భములో కానాను స్త్రీ ఒకతె వచ్చి ప్రభువా, నన్ను కరుణింపుమని పలుకుచూ ఆయనకు విజ్ఞాపన చేసింది (మత్త 15:25). మనం ప్రార్ధనలలో దేవునికి ఎట్లు విజ్ఞాపన చేస్తామో అట్లే ఆమె ఆయనకు విజ్ఞాపన చేసింది. ఇతరులు కూడా ఆయనను ఆరాధించారు (మత్త 18:26; 20:20).

యేసు మృతులలో నుండి లేచిన తరువాత శిష్యులైన కొందరు స్త్రీలకు ఆయన కనబడ్డారు. వారాయనకు నమస్కారములు చేసి (ఆరాధించి) మహానందముతో యెరూషలేముకు తిరిగి వెళ్ళిరి (లూకా 24:52).

మనం హెబ్రీ పత్రికను తెరిస్తే అది బాహాటముగా ఇట్లు చెప్పుచున్నది. "నీవు నా కుమారుడవు. నేను నేడు నిన్ను కనియున్నాను అనియు, ఇదియుగాక నేను ఆయనకు తండ్రినై యుందును. ఆయన నాకు కుమారుడై యుందును అనియు ఆ దూతలలో ఎవనితోనైన ఎప్పుడైనను చెప్పెనా? మరియు ఆయన భూలోకమునకు ఆదిసంభూతుని మరల రప్పించినప్పుడు దేవుని దూతలందరు ఆయనకు నమస్కారము చేయవలెనని చెప్పుచున్నాడు. తన దూతలను వాయువులు గాను తన సేవకులను అగ్ని జ్వాలలు గాను చేసికొనువాడు అని తన దూతలను గూర్చి చెప్పుచున్నాడు గాని తన కుమారుని గూర్చి యైతే దేవా, నీ సింహాసనము నిరంతరము నిలుచునది, నీరాజ దండము న్యాయార్థమైనది" (హెబ్రీ 1:4-8).

ఏదైన సంగతి యదార్థమనడానికి దాన్ని గూర్చి దేవుడు ఎన్నిసార్లు చెప్పాలి? ఒక్కసారి! సంఘస్థాపనము తరువాత సహోదరులు ఆదివారమున కూడుకొన్నట్లు ఎన్ని సందర్భాలున్నాయి? ఒక్కటి! (అపొ. కా. 20:7). దానిని మనం అనుసరించదగు ఉదాహరణగా తీసికొని, యేసు ప్రభువును ఆరాధించే సందర్భాలను ఎందుకు విస్మరిస్తాము? మొదటి శతాబ్ధములో ప్రజలు, దూతలు యేసును

ఆరాధించుట సరియైతే, అది నేడు కూడా మనకు సరియే.

ఆయన నాప్రభువు. "నా ప్రభువా, నాదేవా" అని తోమా పలికెను (యోహాను 20:28). ఆయన నీ ప్రభువా?

ఆయన నా రాజు. "ఆయన ప్రభువులకు ప్రభువు; రాజులకు రాజు" (1తిమో 5:15; ప్రక 17:14; 19:16). ఆయన నీ రాజా ?

ఆయన నారక్షకుడు (లూకా 2:11; యోహా 4:42; అపో.కా. 5:31; ఎఫెసీ 5:23; తీతు 2:13), ఆయన నీ రక్షకుడా ?

ఆయన నా శిరస్సు (ఎఫెసీ 1:22-23, కొలస్స 1:18, 24; ఆయన నీ శిరస్సా?

ఆయన నా దేవుడు (యోహా 10:28; తీతు 2:13). ఆయన నీ దేవుడా ?

ఆయన నా ప్రధాన యాజకుడు. (హెబ్రీ 3:1; 4:14; 5:15; 6:20; 9:11). ఆయన నీ ప్రధాన యాజకుడా?

ఆయన నన్ను తన స్వరక్తమిచ్చి కొనెను (అపో.కా. 20:28). ఆయన నిన్ను అట్లు కొన్నారా ?

అపొస్తలులు యేసును ఆరాధించుట సరియే. అపొస్తలుల మాదిరిననుసరించి మనం యేసును ఆరాధింప బాధ్యులం.

– రేహాక్

## విశ్వాస మూలికలు
## (Elements of Faith)

ఎరిచయం :

1. బైబిలులో విశ్వాసము అను మాట సంగ్రహమైనది.
2 సాధారణంగా అది, మానవజాతి కందించబడిన సర్వసత్యాన్ని సూచిస్తాది మరియు దేవుని రక్షణ షరతుల కొరకు ఒక వ్యక్తి యొక్క స్పందనను సూచిస్తాది (యోహాను 3:16; 8:24; హెబ్రీ 11:6).
3. వ్యక్తిగత విశ్వాసంలో పలు ప్రాముఖ్య మూలికలుంటాయి.

I. విశ్వాస మూర్తి

A. విశ్వాసము గ్రుడ్డిది కాదు. అదొక మూర్తిని వీక్షిస్తాది.

B. బైబిలు విశ్వాసం ఉంటే యేసును వీక్షిస్తాము (యెావూను 8: 27-30).

C. "మన విశ్వాసమునకు కర్తయు, దాని కొనసాగించువాడునైన యేసు వైపు చూచుచు...." (హెబ్రీ 12:2).

D. " ఆయన దూతల కంటే కొంచెము తక్కువ వాడుగా చేయబడిన....

వానిగ ఆయనను చూచుచున్నాము" (హెబ్రీ 2:9).

**II. విశ్వాసంలో నిజస్వరూపం :**

A. "విశ్వాసమనునది నిరీక్షింపబడు వాటి యొక్క నిజస్వరూపమును అదృశ్యమైనవి యున్నవనుటకు ఋజువునై యున్నది" (హెబ్రీ 11:3).

B. విశ్వాసం నిర్ధారణనిస్తుంది.

C. మనం భౌతిక నేత్రాలతో చూడలేని నిజస్వరూపాన్ని విశ్వాసం మనకు గోచరింపచేస్తుంది. దేవుడు, క్రీస్తు, పరిశుద్ధాత్ముడు, పరలోకం మొ॥నవి.

అందు వలననే, "మనం వెలి చూపు వలన గాక విశ్వాసము వలన" నడుచుచున్నామని పౌలు చెప్పాడు (2 కొరింథీ 5:7).

**III. విశ్వాసంలో నమ్మికయున్నది.**

A. అబ్రహాము యొక్క విశ్వాసము పరీక్షింపబడినప్పుడు అతడు తన దేవుని యందు నమ్మికయుంచాడు (హెబ్రీ 11:17-19).

B. "అవిశ్వాసము వనల దేవుని వాగ్ధానమును గూర్చి సందేహింపక దేవుని మహిమ పరచి, ఆయన వాగ్ధానము చేసిన దానిని నెరవేర్చుటకు సమర్ధుడని రూఢిగా విశ్వసించి విశ్వాసము వలన బలము నొందెను" (రోమా 4:20-21).

C. అబ్రహాము కుమారుడైన ఇస్సాకు, "నిప్పును కట్టెలును ఉన్నవిగాని, దహన బలికి గొర్రెపిల్ల ఏదని అడుగగా" (ఆది.కా. 22:7).

D. అబ్రహాము విశ్వాసము వలన "దేవుడే దహనబలికి గొర్రెపిల్లను చూచుకొనునని" చెప్పెను (ఆది.కా. 22:8).

**IV. విశ్వాసములో ఒప్పుకోలు ఒక మూలికయైయున్నది.**

A. ఒప్పుకోలు లేకపోతే విశ్వాసము వ్యర్థము.

B. "అయినను అధికారులలో కూడా అనేకులు ఆయన యందు విశ్వాసముంచిరి గాని సమాజములో నుండి వెలివేయబడుదు మేమో యని పరిసయ్యులకు భయపడి వారు ఒప్పుకొనలేదు. వారు దేవుని మెప్పు కంటే మనుష్యుల మెప్పును ఎక్కువగా అపేక్షించిరి" (యోహాను 12: 42-43).

C. సరియైన విశ్వాసం ఉంటే యేసును ఒప్పుకొంటాము (మత్త 10:32-33).

**V. విధేయేతలో విశ్వాసం ప్రదర్శింపబడ్తాది :**

A సువార్త ద్వారా విశ్వాసమునకు విధేయత కనబడును (రోమా 16:26).

B. క్రియల వలననే గాక, విధేయత చూపు విశ్వాసము వలన రక్షింప

బద్ధాము (రోమా 3:28).

C. సిలోయమను కోనేరు దగ్గర గ్రుడ్డివాడు ఎప్పుడు చూపు పొందాడు? ప్రభువు మాటలకు లోబడకముందా? దాని తరువా తనా? (యోహాను 9:1-7).

D. "నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడును; నమ్మనొల్లనివానికి శిక్ష విధింపబడునని" యేసు చెప్పెను (మార్కు 16:16).

E. క్రియలు లేని విశ్వాసము మృతము (యాకోబు 2:14-24)

VI. విశ్వాసము పట్టుదల కలిగి యుండును:

A. విశ్వాసములో పట్టుదల కలిగి యుండాలి. (2 పేతురు 1:5-8).

B. పట్టుదల కలిగిన విశ్వాసము పరలోక బహుమానమునకు నడిపించును (1 పేతురు 1:3-9).

VII. విశ్వాసములో ప్రేమయున్నది.

A. విశ్వాసము, ప్రేమ రెండు కలిసే యుంటాయి. క్రీస్తుయేసునందుం చవలసిన విశ్వాస ప్రేమలు కలిగినవ డవై నీవు నా వలన వినిన హితవాక్య ప్రమాణమును గైకొనుము" (2 తిమోతి 1:13).

B. "ఎవడైనను - నేను దేవుని ప్రేమించు చున్నానని చెప్పి తన సహోదరుని ద్వేషించిన యెడల అతడు అబద్ధికు డగును. తాను చూచిన తన సహోద రుని ప్రేమింపని వాడు తాను చూడని దేవుని ప్రేమింపలేదు. దేవుని ప్రేమించు వాడు తన సహోదరుని ప్రేమింపవలెనను ఆజ్ఞనుమనమా యన వలన పొంది యున్నాము" (1 యోహాను 4:20-21).

ముగింపు :

- నిజ విశ్వాసమునకొక మూర్తి యున్నాడు,దానికి నిజస్వరూపము న్నది.
- యేసుక్రీస్తును ఒప్పుకొంటూ, ఆయనకు విధేయత చూపుచూ అది కొనసాగును.
- అది పట్టుదల కలిగి, దేవుని యెడల, ఇరుగుపొరుగు వారి యెడలను నిస్వార్థ ప్రేమ కలిగియుండును.

- జెర్రీ దేవిడ్సన్

**మీరు సత్యవాక్కు సాలు చందా చెల్లించారా? లేదా ఇప్పుడే 50/- రూ॥లు పంపించి మీ పత్రిక కొనసాగించుకొనండి. క్రొత్తవారిని చేర్పించండి.**

**- ఎడిటర్**

పరిసరగ్రామముల సువార్తికుల అనేకులు హాజరై ఆగొప్ప సంతోషములో పాల్గొనిరి. జాషువా గారు వాక్యపరిచర్యచేసిరి. నిడసనమెట్ట సువార్తికులు ప్రేమ్ సుధీర్ గారు అధ్యక్షతవహించగా పలువురు సువార్తికులు ప్రార్ధనలలో సహకరించిరి. హాజరైన వారందరికీ స్థానిక సంఘము మంచి విందు నేర్పాటు చేసిరి. మధ్యాహ్నకాలమందు అదే నూతన ఆలయములో సువార్తికుల సహవాసకూటము జరిగెను. నర్సాపుర పేటలోను, రామచంద్రపురం పదంవారి పేటలోను సోదరులు యన్. ప్రసాద్ గారు బలమైన సువార్తిపని చేయుచున్నారు.

2013 జూన్ 20,21,22 తేదీలలో పలివెలలో యున్న క్రీస్తుసంఘము సువార్త కూటములు జరిపించిరి. ఆకూటములలో సోదరులు కిరణ్ కుమార్ (రాజమండ్రి), జయరాజు (తణుకు), జాషువా గూటం గార్లు పాల్గొని వాక్యపరిచర్య చేసిరి, మొదటి రెండు రోజులలోను వాతావరణం అనుకూలించకపోయినను స్థానికులు హాజరై సభలను జయకరముగావించిరి. మూడవదినమున జాషువాగారు సతీసమేతముగా హాజరై చక్కటివాక్యపర్చిచర్యగావించిరి. పలివెలలోన్ను, పరిసర గ్రామములలోన్ను సోదరులు పి.జె. కృపాలిని గారు నిర్విరామ కృషిసల్పుచు క్రీస్తుసంఘములను బలపరచుచున్నారు.

2013 జూన్ 27వ తేదీ గురువారం ముమ్మిడివరం మండలం కొండుకొదురులో నిర్మించబడిన క్రీస్తుసంఘ నూతన ఆలయమును సోదరులు జాషువాగారు రిబ్బను కత్తిరించి ప్రభువు సేవార్ధమై ప్రతిష్టించిరి. తదుపరిజరిగిన కూటములో డెల్టాప్రాంతములోను, కోనసీమలోను ఆరంభమైన ప్రభువు సంఘ పనిని జ్ఞప్తికి తెస్తు గూటం అప్పారావు గారు, చింతామోషేగారు, దొగ్గా సామ్యేలుగారు చేసిన కృషిని జాషువా గారు శ్లాఘించిరి. మంచి వాక్యపరిచర్య చేసిరి. సోదరులు సి.హెచ్ జాన్ బాబు (ముంగండ), యస్. ఏలియాగార్లు ప్రార్ధనలు చేసిరి. తదుపరి హాజరైన వారందరికీ మంచి విందు ఏర్పాటు చేయబడెను. కొండుకుదురు, తొత్తరమూడి సంఘాలలో సోదరులు డి. ఇశ్రాయేలు రాజుగారు వాక్యపరిచర్య చేయుచున్నారు.

2013 జూన్ 28వ తేదీ ఉదయం రిక్కీగూటం గారు, జస్టిన్ గూటం గారు, సుదీప గూటం గారు తమ మూడు నెలల అమెరికా పర్యటన ముగించుకొని సురక్షితముగా కాకినాడ చేరుకొనిరి.

## మీకొకగొప్పసదవకాశం

**సత్యవాణి** ద్వారా ప్రచురింపబడిన అత్యంత విలువైన పుస్తకములు 15 రకములు ఇప్పుడు లభ్యమగుచున్నవి. వాటి నికర మూల్యము 500/- రూ॥లు అగును. గాని మీరు 85/- రూ॥లు మాత్రమే మాకు M.O. పంపి వాటిని ఉచితముగా పొందవచ్చును. బైబిల్‌విద్యార్థులకు, బోధకులకు, తర్ఫీతుశాలలకు యిది గొప్ప సదవకాశం. ఈ రోజే మాకు వ్రాయండి. M.O.పంపించి పుస్తకములను పొందండి. మీ యింటిలో మినీ లైబ్రరీని స్థాపించండి.

**Satya Vani**

#7-9-35, Sambamurth Street,
Kakinada - 533 004. Ph: 0884 - 2363722

RNI Regd. No. 69973/98
Postal Regd. No. AP-VM/KD/02/2012-2014

To

From:
**SATYA VAKKU**
P.O. Box 80, Kakinada - 533 001

Edited & Published by Joshua Gootam. Printed by him at Satya Vani Publication, Sambamurthy St., Kakinada - 533 004